# మాధవనగర్

- సంధ్య






మా వూరంటే నాకెంతో ఇష్టం, అభిమానం, ప్రేమ ఇంకా చాలా చాలా అనుకోండి. మా ఊరి పేరు మాధవనగర్. ఇది నిజామాబాదు జిల్లా, నిజామాబాదు మండలంలో వుంది. మా ఊరి గురించి చెప్పే ముందు నిజామాబాదు గురించి కూడ కొంచెం చెప్పాలి మీకు, ఎందుకంటే ఉదయం లేవడంతోటే మా వూరి వారందరి దైనందిన కార్యక్రమాలు నిజామాబాదుతోనే ముడిపడి వుంటాయి కాబట్టి. నిజామాబాదు పూర్వ నామము ఇంద్రపురి లేదా ఇందూరు. దీనిని చాళుక్యులు, తుగ్లకులు, గోల్కొండ రాజులు, నిజాం నవాబులు పరిపాలించారు. ఇది జిల్లాగా 1905 వ సంవత్సరంలో ఏర్పడింది, అంటే నిజామాబాదు జిల్లాకు సరిగ్గా వంద వసంతాలు నిండాయన్నమాట. పర్యాటక స్థలంగా అభివృద్ధిచేయాలన్న ఉద్దేశంతో 2001లో ఇందూరు ఉత్సవాలను ప్రారంభించారు. ప్రభుత్వాల మార్పిడివల్ల కాబోలు వంద వసంతాల శుభ సందర్భంలో ఘనంగా ఉత్సవాలు జరపవలసిందిపోయి, ఇంతవరకు వాటి వూసే లేదు.

ఇక మా ఊరు నిజామాబాదు హైదరాబాదు జాతీయ రహదారి మీద నిజామాబాదు పట్టణానికి తూర్పువైపు నాలుగు కిలోమీటర్ల దూరంలో వుంది. నాచిన్నప్పుడయితే దూరం అనిపించేదికాని, ఇప్పుడయితే పట్టణంలో కలిసి పోయినట్లుగా వుంటుంది.

ఇక ఊరి పుట్టు పూర్వోత్తరాలకొస్తే, మావూరి వయస్సు 57 సంవత్సరాలు. 1948 వ సంవత్సరంలో గుంటూరు జిల్లాలోని రేపల్లె తాలూకా, గుంటూరు తాలూకా, మరియు క్రిష్ణాజిల్లాలోని గుడివాడ తాలూకాల నుండి రైతు కుటుంబాలు వలస వచ్చి ఈ గ్రామాన్ని నిర్మించారు. అట్టి వారిలో ముఖ్యులు శ్రీ వేములపల్లి శ్రీరాములు (మానాయనమ్మ తండ్రి), శ్రీ చాపరాల అచ్చయ్యగార్లు. ఇక పేరెలా వచ్చిందంటే రోడ్ల నిర్మాణంలోనూ, గ్రామాభివృద్ధిలోనూ నాటి జిల్లా కలెక్టర్ "మాధవరావు" గారు సహకరించి ప్రభుత్వము వారి నుండి ఆర్థిక సహాయము చేయించినందువల్ల, వారి గౌరవార్థం మా ఊరికి 'మాధవనగర్' అని పేరు పెట్టారు.

జాతీయ రహదారి మీద వుందని చెప్పాను కదా, దానికి ఒక వైపు పచ్చని పొలాలు, మరో వైపు ఊరు. ఉత్తర దక్షిణాలుగ 30 అడుగులు వెడల్పు గల రోడ్లు, ప్రతి ఇంటి స్థలానికి తూర్పు, పడమర దిక్కులందు రోడ్లు వచ్చేలాగున, అలాగే ప్రతి మూడు ఇళ్ళస్థలాల తరువాత ఒక అడ్డ రోడ్డు (ఇది కూడా 30 అడుగుల వెడల్పే) వచ్చేలా వూరిని నిర్మించారు. ఊరి మధ్యలో ప్రాథమిక పాఠశాల మరియు ఆట స్థలాలు నిర్మించారు. అలాగే 1949 లో ఊరికి తూర్పున ఐదు ఎకరముల స్థలములో పశువుల అవసరాలకనీ, అగ్నిప్రమాదలేమైనా సంభవించినపుడు ఉపయోగపడుతునదనీ ఓ చెరువును నిర్మించారు. ఊరికి ఉత్తరాన ఆరు ఎకరముల స్థలములో " శ్రీ షిర్డీ సాయిబాబా" మందిరం ప్రముఖ వ్యాపారి శ్రీ అంజయ్య గారు నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దీన్ని చాల మంది చిన్న షిర్డీగా భావిస్తారు. నాకు వూహ తెలిసే నాటికే గ్రామ పంచాయితీ (దీనిలోనే గ్రంథాలయం కూడా వుంటుంది), సహకార సంఘం, పశువుల ఆసుపత్రికి విడి విడిగా భవనాలు కూడా నిర్మించబడ్డాయి. చెరువు గట్టు ప్రక్కనే నేను పెద్దయ్యాక రామాలయం కూడా నిర్మించారు. ఊరి మధ్యలో నాలుగు రోడ్డులు కలిసే దగ్గర మహాత్మాగాంధీ విగ్రహం స్థాపించారు. ఇవి నా చిన్నప్పటి మా ఊరి రూపు రేఖలు. ఇప్పుడు చాల మార్పు చెందిందనుకోండి.

ఇక సౌకర్యాలూ, సదుపాయాల విషయానికి వస్తే (రవాణా, విద్యుత్తు, విద్య, వైద్య, నీటి సౌకర్యాలు), మా

నాన్న గారు వాళ్ళు చిన్నప్పుడు ఇబ్బందులని ఎదుర్కొన్నారు కాని మా తరానికి వచ్చేప్పటికి ఎలాంటి ఇబ్బందులు లేవు. ప్రతి గంటకి నిజామాబాదు వెళ్ళిరావడానికి వుదయం గం 5.30 ల నుండి రాత్రి గం8.30 ల వరకూ బస్సులు వుండేవి (అప్పుడు 25 పైసలు అయితే ఇప్పుడు 3 రూపాయలు బస్సు చార్జీ), రిక్షాలు కూడా అందుబాటులో వుండేవి. ఇవి కాక స్వంత వాహనాలు (సైకిళ్ళు, మోటారు సైకిళ్ళు మరియు స్కూటర్లు ) కూడా విరివిగా అమ్మాయిలు, అబ్బాయిలు వాడుతుండేవారు, ఇప్పుడయితే చెప్పేపనే లేదనుకోండి. నాకు మాత్రం అప్పుడు ఇప్పుడూ కూడా సైకిలు తొక్కడం రాదు. మా పిన్ని 'నీకొక్కదానికేనే అమ్మాయీ, ఊళ్ళో సైకిలు తొక్కడం రానిది' అని బాధ పడేది. అయితే అప్పట్లో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారి బస్సులు మావూరి మీదుగా వెళ్ళినా ఆగేవి కావు. అలాగే హైదరాబాదు వెళ్ళాలన్నా నిజామాబాదు వెళ్ళి ఎక్కవలసిందే ఇప్పుడయితే ప్రతి బస్సూ ఆగుతుంది. ఇప్పుడు చాలా ప్రాంతాలకు అంటే కోస్తా ప్రాంతాల వైపు వెళ్ళాలన్నా ఊరిలోనే బస్సు ఎక్కి దిగవచ్చు. ఇంక ఆటోలు, సిటీ బస్సులు, స్వంత వాహనాల సంగతి సరేసరి. నిత్యావసర వస్తువుల విషయానికి వస్తే ఒకటీ, రెండూ పచారి దుకాణాలు ఉన్నా అప్పుడూ ఇప్పుడూ కూడా నిజామాబాదు వెళ్ళడానికి పది నిముషాలు కూడా పట్టదు కాబట్టి అక్కడికి వెళ్ళి తెచ్చుకోవడమే అలవాటు.

విద్యుత్తు కొరత వేసవిలో అప్పుడప్పుడూ వుంటూ వుండేది, పరీక్షల సమయంలో కాస్త ఇబ్బందిగా వుండేది. అలాంటప్పుడు కిరసనాయిలు దీపాలు వాడే వాళ్ళం. ఇప్పుడయితే క్రొవొత్తులు వాడుతున్నారు. విద్య విషయానికొస్తే ప్రాథమిక విద్యానంతరం అందరూ ఉన్నత పాఠశాల విద్య కొరకు బోర్గాం (ఈ ఊరు నిజామాబాదు, మాధవనగర్‌ల మధ్య వుంది), నిజామాబాదు, మరియు కళాశాల చదువుల కొరకు నిజామాబాదు వేళ్ళేవారు. ఇప్పుడూ కూడా అలాగే వెళ్తున్నారు. నిజామాబాదు అతి దగ్గర అవ్వడం వలన, మావూరిలో ఉన్నత పాఠశాల లేదే అని చింత పడవలసిన అవసరం కలగలేదు. ఒక రకంగా చెప్పాలంటే మావూరు రెసిడెన్షియల్ కాలనీలాగ ప్రశాంతంగా వుండేదనుకోండి. నా పాఠశాల విద్య అంతా ధర్మారం అనే గ్రామంలో జరిగింది. తరువాత ఈ ఊరే మా అత్తగారి వూరయ్యింది. మా వూరికి నిజామాబాదు ఎంత దూరంలో వుంటుందో ధర్మారం కూడా అంతే దూరంలో వుంటుంది, అంటే సరిగ్గా మా వూరు రెంటికీ మధ్యలో వుంటుందన్నమాట. మా పెద్దమ్మ గారి పిల్లలు కూడ అక్కడే చదువుతుండేవారు కనుక తోడుగా వుంటారని నన్ను కూడా అక్కడ చేర్పించారు. రోజూ బస్సులో వెళ్ళి వచ్చేదాన్ని .మా తమ్ముళ్ళు అమ్మమ్మదగ్గర వుండేవారు చిన్నప్పుడు, తర్వాత హైస్కూలుకి ఇక్కడికే వచ్చారు. నిజామాబాదు వెళ్ళి చదువుకొనేవారు. తర్వాత కళాశాల చదువంతా నిజామాబాదులో జరిగింది. చదువుతుండగానే నా వివాహం జరగడం. చదువయ్యాక మావారితో హైదరాబాదులో నివాసం. తరువాతి ఏడాది మావారి ఉద్యోగ రీత్యా ఆంధ్ర దేశానికి దూరంగా వెళ్ళడం, అలా తిరుగుతూ, తిరుగుతూ ప్రస్తుతం కాలిఫోర్నియాలో నివాసం. మా ఊరివారు ఉన్నత విద్య కోసం అంటే పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలంటే హైదరాబాదు లేదా మరెక్కడికయినా వెళ్ళాల్సిందే ఇప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి పి.జి. సెంటరు వుంది. ఇంజనీరింగు కాలేజీలు వున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నిజామబాదులో క్రొత్త యూనివర్సిటి ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వ సమాచారం. నిజామబాదు, మెదక్ మరియు ఆదిలాబాదు జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయి. అలాగే ఉన్నత విద్యనభ్యసించి విదేశాలలో స్థిరపడిన వారు, వున్నత విద్యనభ్యసించి ఊరికోసమే పాటు పడేవారు అక్కడే చాలా మంది వున్నారు.

వైద్యం కోసం ఐతే నిజామాబాదు వెళ్ళడమే. అర్థరాత్రి, అపరాత్రి అని భేదం లేకుండా అక్కడికి వెళ్ళడానికి ఆ రోజుల్లో కూడా వీలుగా వుండేది. ఇప్పుడు చెప్పే పనే లేదు. ఇక నీటి వసతి గురించి చెప్పాలంటే, నీటి కరువు ఎప్పుడూ లేదు, చాలా వరకు అందరి ఇళ్ళలో బోరు పంపులు వుండేవి, కొద్ది మందికి లేక పోయినా ప్రక్కవాళ్ళ దగ్గరకి వేళ్ళి తెచ్చుకొనేవారు. ఇప్పుడయితే పంచాయతీ తరుపున ఇంటింటికీ కుళాయిలు వున్నాయి. ఇక పొలాలకు పంట కాల్వలద్వారా పుష్కలంగా నీరందేది.

మీకు మా ఊరి భూములు, పంటల గురించి చెప్పనే లేదు కదా! మా ఊళ్ళోని భూములు మంచి సారవంతమైన నల్లరేగడి మాగాణి భూములు. వరి, చెఱకు ప్రధాన పంటలయినా పసుపు, అరటి కూడా పండిస్తారు. ఇవి కాక మొక్కజొన్న, పెసర, శనగ మొదలయిన పంటలతో బాటు కూరగాయలు కూడా పండిస్తారు. ధాన్యాన్ని పురులు కట్టి నిల్వ చేసేవారు. చెఱకు నిజాం సుగర్ ఫ్యాక్టరీ పంపేవారు. బెల్లం కూడా వండేవారు. అప్పుడప్పుడు పొలం వెళ్ళి చెఱకు గడలు తెచ్చుకొనే వాళ్ళం. జలుబు, దగ్గు వున్నా చెఱకులు విపరీతంగా తినేవాళ్ళం. బెల్లం వండేటప్పుడు పై పూత పాకం వచ్చినప్పుడు చెఱకు కణుపులను ముంచి ఇచ్చేవారు, ఇది చీకుతూ వుంటే చాలా ఆనందంగా వుండేది. ఇప్పటి పిల్లలు తినే "లాలిపాప్" లాగ అన్నమాట. అలాగే బెల్లం వండాక పై పొర కాస్త రాక చెక్కలాగ వచ్చేది, దీనిని చెక్క బెల్లం అనే వారు. ఇది చాల రుచిగా వుండేది. కాని, గత నాలుగు సంవత్సరాలుగా వర్షాలు లేక పోవడం వల్ల నాట్లు వేయకుండా భూమిని వదిలేశారు (బోరుల కింద కొద్దిగ వేశారనుకోండి). ఒక దానితో ఒకటి ముడి పడి వుంది కాబట్టి సమృద్ధిగా వుండే పాడి పరిశ్రమ కూడా కాస్త కుంటుపడింది. కోళ్ళఫారాలు పర్వాలేదు. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురియడం వల్ల పరిస్థితి మెరుగుపడుతుందని ఆశిస్తున్నాను.

ఇక ఇళ్ళల్లో పండ్ల చెట్టులు జామ, వుసిరి వీటిని ఎక్కి పండ్లు కోసుకోవడం సరదాగ వుండేది. సీమ చింతకాయల చెట్లు దానిమ్మ చెట్లు ఎక్కరాదు కాబట్టి గడలతో కోసుకొనేవాళ్ళం. నా చిన్నప్పుడు వంట కట్టెల పొయ్యి, తర్వాత గోబర్ గ్యాస్, తర్వాత సిలిండర్ గ్యాస్ మీద చేసేవారు. టీవీ, ఫోనులయితే నేను స్కూలు లో వున్న టైములో ఇద్దరు, ముగ్గురి దగ్గరనే వుండేవి. ఇప్పుడు అందరి ఇళ్ళళ్ళోనూ వుండడం మామూలు విషయం.

వినోదంగురించి చెప్పాలంటే, సినిమాలకు, షికార్లకు నిజామాబాదు వెళ్ళడమే. నా చిన్నతనంలో నాటకాల వాళ్ళు వచ్చి ఒక నెలరోజుల పాటు వుండి నాటకాలు వేసి వెళ్ళేవారు. తర్వాత్తర్వాత అంతగా వచ్చే వారు కాదు. బహుశా ఆదరణ అంతగా లేకపోవడం వల్ల కాబోలు. అసలు వినోదమంతా అమ్మాయిలతో ఆడుకున్న తొక్కుడుబిళ్ళ, గవ్వలు, చింత పిక్కలు, అబ్బాయిలతో ఆడుకున్న బిళ్ళంగోడు, బొంగరాలు, గోళీలు, గాలిపటాలు ఎగురవేయడం, అందరంకలసి ఆడుకున్న కబడ్డీ, ఖో ఖో, దాగుడుమూతల్లోనే ఉండేది.

పండుగలు చాలానే చేసేవారు. ముఖ్యమైనవి సంక్రాంతి, సంవత్సరాది, శ్రీరామనవమి, వినాయక చవితి, దసరా, దీపావళి మొదలయినవి. పంటలు చేతికి వచ్చేవి కనుక సంక్రాంతిని చాలా బాగా జరిపే వారు. కోస్తా ప్రాంతాల నుండి హరిదాసులు వచ్చేవారు. నెల రోజుల పాటు వుండి వెళ్ళే వాళ్ళు. గంగిరెద్దులు, ముగ్గులు, గొబ్బెమ్మలతో రోజూ సందడిగా, వాకిళ్ళు శోభాయమానంగా వుండేవి. మరి పిల్లలకయితే ఎప్పుడూ ఆటపాటలే, మరి పెద్ద వారికి అలాకాదు కదా, అందుకే దసరా సంక్రాతుల సందర్భంగా పెద్దవారికి ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించేవారు. చుట్టు ప్రక్కల గ్రామాల వారిని పోటీలో పాల్గొనేందుకు ఆహ్వానించేవారు. ఇప్పుడు ఎందువల్లో ఇవన్నీ కనుమరుగైనాయి.

సమాచార మాధ్యమాల విషయానికి వస్తే ఆ రోజుల్లో రేడియోదే ప్రథమ స్థానం, తరువాతి స్థానం దిన పత్రికలది. దిన పత్రికలు తెల్లవారక ముందేవచ్చేవి. వార పత్రికలు నిజామాబాదు నుండి తెచ్చుకోవడమే. ఇప్పుడు రేడియో స్థానాన్ని టీవీ ఆక్రమించేసింది. దిన పత్రికల స్థానం అప్పుడూ, ఇప్పుడు అలాగే వుంది. ఇప్పుడు నాకు చాలా ఆనందాన్నిచ్చే విషయం ఏంటంటే ప్రతి రోజూ ఇంటర్నెట్లో తెలుగు పేపర్లు చదవడం, నిజామాబాదు ఎడిషన్లో మావూరి కబుర్లేమయినా వున్నాయేమో నని వెదకడం, రోజూ వుండవనుకోండి అయినా అలా వెదుక్కోవడంలో అదో ఆనందం. అప్పుడప్పుడూ కనిపిస్తూ వుంటాయిలెండి మావూరి వార్తలు.

మా ఊరి రాజకీయాల గురించి చెప్పలేదు కదా, మా ఊరిలోని చిన్నా, పెద్దా అందరికి రాజకీయ చైతన్యం ఎక్కువే.

కాంగ్రెస్, తెలుగుదేశం, మరియు వామ పక్షాలు ఇలా అన్ని పార్టీల వాళ్ళూ వున్నారు. ఎన్నికల సమయంలో విపరీతమైన సందడి. ఎన్నికలసమయంలో (మామూలు సమయంలో దారే అయినా ఆగరనుకోండి) ప్రతి రాజకీయ నాయకులు , నాయకురాళ్ళు ఆగి గాంధీ విగ్రహానికి దండ వేసి వెళ్ళ వలసిందే అలా వచ్చినప్పుడే నేను శ్రీమతి ఇందిరా గాంధీ, శ్రీ యన్.టి. రామారావు గార్లను మా వూరిలోనే చూడటం జరిగింది. మా వూరి వారు ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం వేరే ప్రాంతాలలో వున్నా వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఈ విషయంలో నేను మా ఊరివారిని చూసి చాలా గర్వపడుతుంటాను.

ముందే చెప్పాను కదా, పట్టణంలో కలసి పోయినట్లుగా వుంటుందని, ఒకవైపున వున్న పొలాలన్ని ఇళ్ళస్థలాలుగా మారాయి. మా ఊరిలో ఇప్పుడు రియలెస్టేట్ వ్యాపారం మూడూ పువ్వులూ, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. మారుతున్న పరిస్థితుల్లో పంటల సాగు కష్ట సాధ్యమని భావించి కొందరు భూములు కౌలుకిచ్చి, కొందరు అమ్ముకొని వేరే వ్యాపారలవైపు మళ్ళుతున్నారు. శాంకరి, విశ్వోదయ అనే కళాశాలలు వెలిశాయి. కోల్డ్ స్టోరేజిలు, పెట్రోలు బంకులు, వివాహాది శుభకార్యాలు, విందుల కోసం కల్యాణ మడపం నిర్మించారు. ఇక సాయి బాబా మందిరాన్ని దర్శించేవారు ఎక్కువవుతుండడంవలన భక్తుల, పర్యాటకుల సౌకర్యార్థం, వసతికిగాను అతిథిగృహాలు, ధర్మశాలలు, మరియు భోజన, ఫలహారశాలలు నిర్మించారు. నా చిన్నప్పుడు అయితే సాయిబాబాకి ఇంత ఆదాయం లేదు. మందిరం కింద వున్న భూమిలో చెఱకు పండించేవారు. ఇప్పుడు పంటలు పండినా పండకపోయినా ఏమీ ఫర్వాలేదు, .భక్తుల వల్ల ఆదాయం పెరిగి ధనవంతుడయ్యాడు. ఆదాయం పెరిగింది కాబట్టి మునుపటి కంటేపెద్ద ఎత్తున అప్పుడప్పుడు అన్నదానాలు చేస్తుంటారు. మరెందుచేతో తెలియదుకాని రామాలయానికి ఆదాయం ఎమీ వుండేది కాదు, కొట్టిన కొబ్బరికాయలు కూడా చిప్పలు పచ్చడి చేసుకోవచ్చుకదా అనుకొనేవారేమో తీసుకొని వెళ్ళే వారు.

ముగించే ముందు నా చిన్ననాటి జ్ఞాపకాలు కొన్ని. వేసవి కాలంలో దోమలతో కుస్తీపడుతూ ఆరుబయట కూర్చుని సెలవులకు వచ్చిన మేనత్త, బాబాయిల పిల్లలతో కబుర్లు చెప్పుకోవడం, తమ్ముళ్ళతో కలిసి పోటీపడి చుక్కలు లెక్క పెట్టడం, ప్రతిదానికి వాదించుకోవడం తర్వాత మెల్లగా నిద్రలోకి జారిపోవడం తలుచుకుంటుంటే మళ్ళీ అలాంటి రోజులు ఎప్పుడొస్తాయో అనిపిస్తుంటుంది. అలాగే, వర్షాకాలం లో తిన్న వేడి వేడి పకోడీలు, వేరుశనగ కాయలు, అమ్మ నాన్న లు చూడకుండ వర్షంలో తడవడం, కాగితపు పడవలు చేయడం, చలికాలంలో తిన్న సీతాఫలాలు (వీటిని ముఖ్యంగా లంబాడీలు తెచ్చి అమ్మేవారు), రేగుపండ్లు, ఇప్పుడు తినాలని అనిపించినా దొరకవు.

ఊరివారందరిలో ఆప్యాయతతో కూడిన పలకరింపుల్లో అప్పటిలాగే, ఇప్పుడూ కూడా మార్పులేదు. ఊరంతా తెలిసినవారే, అందులో చాలా మంది చుట్టాలే, ఊరెళ్ళితే సమయం ఇట్టే గడిచిపోతుంది. చిన్ననాటి స్నేహితులతో కాలక్షేపానికి కొదవలేదు. అందుకే మా ఊరంటే నా కిష్టం. ఈ అవకాశం ఇచ్చిన సుజనరంజని సంపాదకులకు ధన్యవాదాలు

శ్రీ మతి సంధ్య గారు Folsom, California నివాసి. శ్రీ మతి సంధ్య గారు గృహిణి. చిత్రలేఖనం, పుస్తక పఠనం, తోట పని లాంటివి వారి సరదాల్లో ముఖ్యమైనవి. తెలుగు సంస్కృతి, సాహిత్యాలపై చాల మక్కువ. శ్రీ శ్రీ గారిసాహిత్యం అంటే చాలా యిష్టం. వీరి శ్రీవారు శ్రీ కుమార్ కలగర గారు కాలిఫోర్నియా లాటరిలో పని చేస్తారు. వీరిద్దరు చాలా తెలుగు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగ పాల్గొంటారు. వీరి అబ్బాయి శ్రీహర్ష Folsom High School లో ౧౨వ తరగతి చదువుతున్నాడు.

పుట్టి పెరిగిన వూరు కన్న తల్లితో సమానం అంటారు. ప్రపంచంలో ఏ మూల వున్నా మన అమ్మని ఎలా మరచి పోలేమో, సొంత ఊరుని కూడా అలానే మరచిపోలేము. దూరం ఎక్కువయ్యే కొద్దీ అనుబంధం మరింత పెరిగినట్లు మన వూరుకి దూరంగా నివసిస్తున్న కొద్దీ మరింత గుర్తొస్తుంటుంది. మీ వూరంటే మీకెందుకంత ఇష్టమో తోటి పాఠకులతో పంచుకోండి. మీ వూళ్ళో చిన్నప్పుడు మీరు చేసిన చిలిపి పనులూ, అప్పటి నేస్తాలూ, ఆడుకున్న ఆటలూ, ఆటల్లో తగాదాలూ, పందాలూ, పండుగ రోజులూ, హైస్కూల్లో అల్లరి సంఘటనలూ..ఏమైనా వ్రాయండి. అప్పటి ఫోటోలు కూడా పంపిస్తే మీ వ్యాసం మరింత అందంగా వుంటుంది..ఈ విశాల ప్రపంచంలో ఇంకెక్కడో ఉన్న మీ వూరి నేస్తాలు మిమ్మల్ని మళ్ళీ పలకరిస్తారేమో చూడండి! మీవూరి జ్ఞా పకాలతో బాటు ప్రస్తుతం మీరేం చేస్తున్నారో, ఎక్కడున్నారో కూడా వ్రాయడం మరువకండి... !!